



# మంచి చెడులను స్పష్టంగా తెలుసుకోవాలి!

**- డి. వెంకట్రామయ్య**

కథకుడిగా ఆయన ప్రముఖుడు. రేడియో కళాకారుడిగా ఆయన ప్రసిద్ధుడు. రేడియో జర్నలిస్టుగా ఆయన అత్యంత అనుభవశాలి.. ఇన్ని విధాల, అన్ని విధాలా తన ప్రతిభనీ ప్రత్యేకతనీ ప్రదర్శించిన సీనియర్ రైటర్ డి. వెంకట్రామయ్యను గురించి చెప్పనవసరం లేదు. సీనియర్ రైటర్‌గానే కాదు, సీరియస్ రైటర్‌గా, సిన్సియర్ రైటర్‌గా కూడా పాఠకుల్లో ఆయనకు మంచి పేరుంది. పేరు లేకపోయినా గుర్తించ కలిగిన ప్రత్యేక శైలి ఆయన కథలది. అలాంటి కథకునితో కాసిన్ని కబుర్లు మీకోసం!!

## మీ గురించి చెప్పండి?

నేను 1941లో కృష్ణాజిల్లా గుడివాడ దగ్గర్లో వున్న దొండపాడు గ్రామంలో సాధారణ రైతు కుటుంబంలో పుట్టాను. మా అమ్మానాన్నలు నాగరత్నమ్మ, దివి కాశీవిశ్వనాథం. నేను ఒక్కడినే సంతానం. నా హైస్కూలు చదువు, కాలేజీ చదువూ అంతా గుడివాడలోనే. 1962లో గుడివాడ ఎ.ఎన్.ఆర్. కళాశాల నించి బి.ఎస్సీ. పాసయ్యాను. 1963లో హైదరాబాద్ వచ్చి ఆలిండియా రేడియోలో చేరాను. ఆ సంవత్సరమే కరుణతో నాకు పెళ్లయింది. మాకు ఇద్దరమ్మాయిలు, ఒకబ్బాయి. అందరూ స్థిరపడ్డారు.



## మొదటి కథ ఎప్పుడు రాశారు?

చిన్నప్పటినుంచీ విపరీతంగా పుస్తకాలు చదివేవాడిని. సాహిత్యం మీద మొదటినుంచీ ఆసక్తి ఎక్కువ. చాలా మంది ప్రముఖుల రచనలు చదవడంతో నాకూ రాయాలనే కోరిక పుట్టింది. సుమారుగా 1966 ప్రాంతంలో మొదటి కథ రాశాను. సుమారు ఎనభై కథలు, రెండు నవలలు, పాతిక ముప్పయి వ్యాసాలు, ఇరవైకి పైగా పీఠికలు, ఇంకా కొన్ని విమర్శలు, సమీక్షలు, కాలమ్స్.. వగైరా రాశాను. ఒక రంగస్థల నాటకం కూడా రాశాను. ఇక హిందీ నుంచి తెలుగులోకి మూడు నవలలు, సుమారు పాతిక కథలు అనువాదం చేశాను.

## రేడియో కోసం ప్రత్యేకంగా రచనలు చేశారా?

అవును. రేడియోకోసం ప్రత్యేకంగా రాసేవాడిని. అలాగే పత్రికల కోసం రాసినవి వాటికి ప్రత్యేకమే! ఏదో ఒక కథ రాసి, నవల రాసి దాన్ని రేడియో నాటికగా మార్చి, వీలయితే సినిమా స్క్రిప్టుగా మార్చటం లాంటి పనులు నేనెప్పుడూ చేయలేదు. రేడియోకి చాలానే రాశాను. నాటికలు ఎక్కువ.. చిన్నా చితకా అన్నీ కలిపి రెండు వందల దాకా రాశాను. ఇవికాక ప్రసంగాలు, రూపకాలు, వ్యాఖ్యానాలు కూడా రాశాను.

## మీకు సినిమారంగంతో పరిచయం ఉందా?

ముప్పయ్యేళ్ల క్రితం వచ్చిన 'పంతులమ్మ' సినిమాకు మాటలు రాశాను. దానికి సింగీతం శ్రీనివాసరావు దర్శకుడు. వాసిరెడ్డి సీతాదేవిగారి 'మట్టిమనిషి' నవలకి దుక్కిపాటి మధుసూదన రావుగారు (అన్నపూర్ణా పిక్చర్స్అధినేత) నాచేత సినిమా స్క్రిప్టు రాయించుకున్నారు గాని, సినిమా తియ్యలేదు.

## మీరు రాయాలనుకుని రాయలేకపోయినవి ఏమైనా ఉన్నాయా?

ఉన్నాయి. ఇటీవల చనిపోయిన హరిపురుషోత్తమరావు (హరి) నేనూ కలిసి 'తెలుగు సినిమా చరిత్ర' రాద్దామని ఇరవయ్యేళ్ల క్రితం అనుకున్నాం. ఆయన నాకంటే ఎనార్కిస్టు. నేను ఆయనకంటే బద్ధకస్తుణ్ణి. అందువల్ల ఆ ఆలోచన కార్యరూపానికి రాలేదు. ఆ కోరిక ఇప్పటికీ నాకుంది. తెలుగులో వార్తా రచన గురించీ, వార్తల అనువాదం గురించీ ఒకటో రెండో పుస్తకాలు రాసిపారేద్దామనుకున్నాను. అనుకోవటమేగాని ఆచరణలో పెట్టలేదు. అన్నిటికంటే పెద్ద కోరిక.. ఆశ.. మామూలు భాషలో మహాభారతం రాయాలని. కొద్దిపాటి చదువు వచ్చిన వాళ్ళు కూడా చదివి అర్థం చేసుకోడానికీ, ఆనందించడానికీ అనువైన భాషలో భారతం రాస్తాను.

## ఇటీవల మీ కథలు ఎక్కడా రాలేదు. కథల్రాయటం మానేశారా?

మానేశాననే మాట అంగీకరించను. అరుదుగా రాస్తున్నాను. అతి తక్కువగా రాస్తున్నాను. రాయకుండా ఉండలేనప్పుడు రాస్తున్నాను.

## అరుదుగా రాయడానికి కారణం?

రాయటం కంటే చదవటం బాగుంటోంది. రాయాలంటే ముఖ్యంగా కథల్లాంటివి రాయాలంటే ఎన్నో ప్రశ్నలూ, ఎన్నో అనుమానాలూ ఎదురొతున్నాయి. ఇంతకు ముందు ఎవరూ చెప్పని విషయం, ఎవరూ చెప్పని చెప్పలేని రీతిలో చెప్పలేకపోతే ఎందుకు రాయాలి? పైగా చలం అన్నట్టు ఆ చెప్పేదానిలో "ఎకానమీ ఆఫ్ వర్డ్స్ అండ్ థాట్స్ లేకపోడం దేశభక్తి కన్నా హీనమైన పాపం.. ఆత్మ లోకంలో దివాలా.."!

## చలంగారంటే మీకిష్టమా?

ఇష్టం కాదు.. భక్తి. చలం, శ్రీశ్రీ, రావిశాస్త్రి, గురజాడ (కన్యాశుల్కం), తిలక్ (అమృతం కురిసిన రాత్రి) లేకపోతే రచయితగా నేనులేను.. రచయితగా నేను పుట్టకముందు, పుడుతున్న తరుణంలోనూ ఈ మహానుభావులంతా నా నెత్తినెక్కి కూర్చున్నారు.. ఇప్పటికీ దిగలేదు.

## మిమ్మల్ని ప్రభావితం చేసిన వాళ్లు వీరేనా?

ఇంకా చాలామంది ఉన్నారు. శ్రీపాద, మల్లాది, కొడవటిగంటి, గోపీచంద్, బుచ్చిబాబు, చాసో, పద్మరాజు , రామారావు మాస్టారు.. వీరు కూడా నేనెంతగానో ఇష్టపడే రచయితలు. వీళ్ళు కాక ఇంగ్లీషు, హిందీ రచయితలు కూడా కొందరున్నారు. నాకు కొద్దిగా హిందీ

## నచ్చినవి

**కథలు** : సారాకథలు (రావిశాస్త్రి)

**నాటకం** : కన్యాశుల్కం (గురజాడ)

**రచయిత** : చలం

**కవి** : శ్రీశ్రీ

**గాయకుడు** : ఘంటసాల

**సంగీత దర్శకుడు** : పెండ్యాల

**గాయని** : జిక్కీ

**నటుడు** : ఎన్టీఆర్

**నటి** : సావిత్రి

**పాట** : లాహిరి లాహిరి లాహిరిలో (మాయాబజార్)

**సినిమా** : మాయాబజార్

**ఊరగాయ** : ఆవకాయ

**వ్యక్తి** : ఎవరూ లేరు. నాకు నేనే!



సంగీత దర్శకుడు కీరవాణితో....

కూడా వచ్చు.

**ఉద్యోగ జీవితం గురించి చెప్పండి?**


రేడియోలో దాదాపు 34 సంవత్సరాలు పని చేశాను. అందులో సుమారు 28 సంవత్సరాల పాటు న్యూస్‌రూమ్‌లోనే పని చేశాను. వార్తలు ఇంగ్లీషునుంచి అనువదించడం, వార్తలు రాయడం చేసేవాడిని. ముఖ్యంగా అనువదించిన వార్తలు అనువాదం అనిపించకుండా రాయడానికి ప్రయత్నించాను. వార్తలు రాయటంలో, అనువదించటంలో, చదవటంలో ఎంతోమందికి శిక్షణ ఇచ్చాను.

**మీరు కథా రచయితగా ప్రసిద్ధులా? రేడియో ఆర్టిస్టుగానా?**

దేనికదే.. రెండూ వేర్వేరు మాధ్యమాలు. ఆ రోజుల్లో మాస్ మీడియా అంటే సినిమా తర్వాత రేడియోనే! ప్రయివేటు టీవీ ఛానెల్సూ, ప్రయివేటు రేడియో ఛానెల్సూ లేని రోజుల్లో నేను ఆకాశవాణిలో పని చేశాను. ఒక పత్రికలో నేను రాసిన కథ కొన్ని వందలమందీ, లేదా కొద్ది వేలమందీ చదివితే – రేడియోలో నా వార్తలు, నాటికలు, ఇతర కార్యక్రమాలూ వినేవారి సంఖ్య లక్షల్లో వుండేది. అన్నిటికీ మించి 'రాంబాబు' పేరుతో సుమారు పదేళ్లపాటు నేను నిర్వహించిన 'కార్మికుల కార్యక్రమం' ఆ రోజుల్లో చాలా పాపులర్.

**రచయితగా మీదే భావజాలం?**

సామాన్య ప్రజల సమస్యలన్నీ తీరడానికీ, సమసమాజ స్థాపనకీ కమ్యూనిజం, మార్క్సిజాలే మార్గమని నేను మొదటినుంచీ నమ్ముతూ వచ్చాను. ఇటీవలి కాలంలో ఆ నమ్మకం కొద్దిగా సడలింది గాని, రచయితగా నేనెప్పుడూ అంతో ఇంతో వామపక్షపాతినే.



అక్కినేనితో....

**ఇప్పటి కథలెలా ఉన్నాయి?**

యిప్పటి కథల్లో అస్తిత్వ స్పృహ బాగా పెరిగింది. కుల, వర్గ, మైనారిటీ, దళిత వర్గాలనుంచి కథలు విస్తృతంగా వస్తున్నాయి. వీరిలో కొంతమందయినా చాలా మంచి కథలు రాస్తున్నారు.

**ఇప్పటి కథకులకు మీరిచ్చే సందేశం..**

సందేశం ఏముంటుంది? కథలు రాయాలంటే జీవితాన్ని బాగా అధ్యయనం చేయాలి. సాహిత్యాన్నీ బాగా అధ్యయనం చేయాలి. ప్రతి కథకునికీ మంచీచెడ్డల గురించి స్పష్టమయిన అవగాహన ఉండాలి. అప్పుడే మంచి కథలు రాయగలుగుతారు.

–వి.ఆర్కే

నాకు నచ్చిన నా కథ

# మనుషుల్ని తినేవాళ్ళు

- డి. వెంకట్రామయ్య

అది స్వర్గం.
అది నరకం.
అది అమృతాల అధరామృతాల జీవనది.
అది కాలకూట విషాల ఊటబావి.
అక్కడ అప్సరసలు అర్ధనగ్నలాస్యాలు చేస్తారు.
అక్కడ మనిషి రక్తపు రుచిమరిగిన రాక్షసులు విలయతాండవం చేస్తారు.
అక్కడ మనుషులుంటారు. మనుషుల్ని తినేవాళ్ళుంటారు.
ఆ స్వర్గం పేరు, ఆ నరకం పేరు....''నవభారత్ విలాస్!''
ఆ పట్టణంలో పేరు మోసిన ''బోర్డింగ్ మరియు లాడ్జింగ్!''
విందులకీ, వినోదాలకీ విఖ్యాతి పొందిన ఆ ''నవభారత్ విలాస్''లో ఆ వేళ రాత్రి తొమ్మిదిగంటల వేళ ఎనిమిదో నంబర్ సింగిల్ రూమ్‌లో-అలవాటు ప్రకారం హడావిడిగా లోపలకడుగెట్టిన బాయ్ రంగడు-చటుక్కున అడుగు వెనక్కి వేసి, నాలిక్కరుచుకుని, తెల్లబోయి నుంచున్నాడు!



ఆ సింగిల్ రూమ్‌లో ఉన్న సింగిల్ బెడ్ మీద పడుకున్న వాళ్లిద్దరూ వొళ్లు మరిచిపోయారు. వొళ్లు బలిసిన మగాడికి కళ్లు కనపడ్డంలేదు. కళ్లు మూసుకున్న ఆడదాని వంటి మీద సగం మేరకి గుడ్డల్లేవు.

తెల్లబోయి నుంచున్న రంగడు తేరుకోకముందే అవతారం లేచి, ''ఒరేయ్ వష్ చావా!..... ఇంకో షీసా...మన బ్రాండ్ నీకు తెలుసుగా..?'' అన్నాడు. అవతారం ఆ మగాడి పేరు.

''సారీ సార్!'' అన్నాడు రంగడు

''ఏమిరా, కొంపదీషి షీసాల్లేవా ఏం?''

''అది గాదు సార్! పొరపాటున....చూడకుండా లోపలికొచ్చేశాను....''

అవతారం వికటాట్టహాసం చేశాడు. చేసి- ''ఓష్! ఇంతే గదా....ఏం ఫర్వాలేదు... ఎంత మంది చూసినా మనకేం భయంలేదు...మన సంగతి నీకు తెలుసుగా. అయినా ఇంకా ఏం లేదులే. ఇంకో బుడ్డి తగిలిస్తే గాని లాభం లేదు. నువ్వు అరనిమిషంలో రావాలి...పరిగెత్తి....''

రంగడు పరిగెత్తేలోగా కళ్లు మూసుకు పడుకున్న ఆడది-కళ్లు సగం విప్పి, సగం లేచి, సగం నవ్వి-''బావ గారికి మరీ ఆత్రమెక్కువ. తలుపైనా బిగించకుండా...'' మిగతా సగం మాటలూ మింగేసింది.

దాని పేరు మాణిక్యం.

రంగడు రూమ్‌లోంచి బయటికొచ్చాడు.

అవతారం పూర్తి పేరు శేషావతారం. చూడ్డానికి వరాహావతారంలా ఉంటాడు. ఇది వరకు చాలా అవతారాలెత్తి చాలా చాలా ఘనకార్యాలు చేశాడు. లేటెస్టు అవతారం-''సహకార సంఘాధ్యక్షుడు''. అవతారానికి సహకార పద్ధతి మీద మంచి విశ్వాసముంది. అందుకే మరి కొందరు పెద్దల సహకారంతో-రైతులకు పంచాల్సిన ఎరువులు, ఋణాలూ చాలా జాగ్రత్తగా స్వాహా చేసి ప్రజా సేవ చేస్తున్నాడు. ఈ రకంగా నానా గడ్డీ తిని, గడ్డిని పెంచే ఎరువులు కూడా తినేసి, తిన్నదంతా అరిగించుకోవడం కోసం అడపా దడపా పట్నమొచ్చి, ''నవభారత్ విలాస్'' భోజన మరియు విశ్రాంతి గృహంలో విశ్రాంతి తీసుకుంటాడు-అవతారం.

అవతారం అర్జంటుగా తెమ్మన్న బుడ్డీ కోసం త్వర త్వరగా నడుస్తున్న రంగణ్ని, పన్నెండో

నంబరు గదిలోంచి పిలిచారు. రంగడు ఆ గదిలోకి వెళ్లాడు.

గదిలో ముగ్గురున్నారు. వాళ్ల చుట్టూ సిగరెట్ పీకలున్నాయి. వాళ్ల చేతుల్లో పేకముక్కలున్నాయి. అందుబాటులో బుడ్లూ, గ్లాసులూ ఉన్నాయి. ముగ్గురి ముందూ రూపాయల కట్టలున్నాయి. గదినిండా-సిగరెట్ పొగ ఉంది.

''ఏం కావాలి సార్?'' అనడిగాడు రంగడు.

''పిల్ల కావాలి'' ఆ ముగ్గురిలోనూ నల్లగా ఎలుగ్గొడ్డులా ఉన్నవాడి సమాధానం.

''ఎవరు కావాలి సార్?''

''ఎవరున్నారేంటి?'' ఈ ప్రశ్న ఎలుగ్గొడ్డుది కాదు. అడివి పందిది. ఎలుగ్గొడ్డుకి కుడివైపున అడివి పంది కూచుంది.

రంగడు సమాధానం చెప్పేలోపునే, ఎనుబోతులా ఉన్న మూడోవాడు ''మాణిక్కెం దొరుకుద్దా?'' అని అడిగాడు.

''లేదు సార్! మాణిక్కెం, సావిత్రీ ఇయ్యాలా, రేపు రెండు రోజులకి బుక్కయిపోయారు సార్!''

''ఇంకెవరున్నార్రా మరి...?'' ఎలుగ్గొడ్డు అడిగింది.

''ఏమో సార్....సూత్తాను......''

''ఇంకా సూత్తావే...లగెత్తు మరి. ఆట ఎత్తేస్తున్నాం...అయిదు నిమిషాల్లో పిల్లని తేవాల. మంచి పిల్లని తెచ్చావంటే నీకో రూపాయ్...ఇంకా సూత్తావే లగెత్తు మరి...!'' అడివిపంది.

ఎలుగ్గొడు....అడవిపంది....ఎనుబోతు- ఈ ముగ్గురికీ ఉమ్మడి వ్యాపారం!





## కథాంతరంగం

దాదాపు నలభయ్యేళ్ళ క్రితం రాసిన కథ ఇది. అప్పటికి రెండు మూడేళ్లయిందేమో నేను కథలు రాయటం ప్రారంభించి. దీనికి ముందు అయిదారు కథలు రాసినట్టున్నాను. వాటిలో ఒకటో రెండో ఆంధ్రజ్యోతి వీక్లీలో వచ్చాయి. ఆ పత్రికవారు 1971లో నిర్వహించిన ఉగాది కథల పోటీలో ఈ కథకి మూడో బహుమతి వచ్చింది. బహుమతి మాట అలావుంచి ఈ కథ వల్ల అప్పట్లో నాకు చాలా మంచి పేరు వచ్చింది. అప్పుడు 'ఆంధ్రజ్యోతి' వారపత్రిక ఎడిటర్‌గా వున్న పురాణం సుబ్రహ్మణ్య శర్మగారికి ఈ కథ మరీ నచ్చింది. ముఖ్యంగా నేనీ కథ రాసిన పద్ధతి. ఆ కథనమే అప్పటి పాఠకుల్నీ, రచయితల్నీ బాగా ఆకర్షించింది. ఆ తర్వాత కొంతమంది రచయితలు ఈ కథా ప్రారంభశైలిని అనుకరించారు కూడా. కథా వస్తువు ఎంత ముఖ్యమో ఆ కథ రాసే పద్ధతి కూడా అంతే ముఖ్యమన్నది అప్పటికీ ఇప్పటికీ నా అభిప్రాయం.

ఇక ఈ కథా వస్తువు దాదాపు అంతా కల్పితమే అయినప్పటికీ, ఆ కల్పనకి ఆధారమైన వాస్తవ సంఘటనలున్నాయి. ఆ రోజుల్లో కొన్ని పట్టణాల్లో, నగరాల్లో కొన్ని హోటళ్లలో జరిగే, ముఖ్యంగా రాత్రిపూట జరిగే అనేకానేక అనైతిక కార్యకలాపాల గురించి నేను విన్న, చదివిన విషయాలు ఈ కథకి మూలం. అప్పట్లో ఈ కథ చదివిన ఒకాయన నన్నడిగాడు 'బెజవాడలో ఫలానా లాడ్జి గురించి గదా మీరీ కథ రాసింది' అని. పర్వాలేదు, నా కథ సహజంగానే ఉందనుకున్నాను.

డి.వెంకట్రామయ్య
**040-23067067**

అది ఫలానా వ్యాపారమని చెప్పడం కష్టం. వాళ్ల అసలు పేర్లు చెప్పడం కూడా కష్టమే. వాళ్లకి విడివిడిగా చాలా పేర్లున్నాయ్. ఉమ్మడిగా చాలా వ్యాపారాలున్నాయ్. అసలు వాళ్లేం చేసినా-ఉమ్మడిగానే చేస్తారు. వ్యాపారం చేసినా, పేకలు కోసినా, పేకాడినా, తాగినా, తందనాలాడినా-ఇంకేం చేసినా ఉమ్మడిగానే. ఆ సంగతి రంగడికి తెలుసు. అందుకే పిల్ల కావాలన్నప్పుడు ఎందరని అడగలేదు.

మేడ దిగి కిందికొచ్చాడు రంగడు. కౌంటర్ దగ్గర హోటల్ ప్రొప్రయిటర్ గుర్నాధం మంత్రిగారి మేనమామ కొడుక్కి కాకాపడుతున్నాడు. డైనింగ్ హాలు కిటకిటలాడుతోంది. రకరకాల పదార్థాలు..మాంసాలు...వాటి వాసనలు..సర్వర్ల హడావిడి....రంగడికి ఆకలి గుర్తొచ్చింది. అన్నం తినేదెప్పటికో. పై గదుల్లో పనిచేయడానికి ఇవ్వాళ రంగడొక్కడే ఉన్నాడు. అతనితో పాటు పనిచేసేవాడివ్వాళ రాలేదు.

డైనింగ్ హాల్ దాటి, కిచెన్ దాటి, ఆ వెనుక ఉన్న గదిలోకి వెళ్లాడు రంగడు. అక్కడ రకరకాల బుడ్లున్నాయి. వాటిలో అవతారానిక్కావలసింది తీసుకుని, అక్కడున్న వాడికి రాసుకోమని చెప్పి బయటకొచ్చాడు. ఆ గదికి ఇంకా వెనక, బాగా మూలగా, చీకటికొట్టులాంటి గదొకటుంది. అందులోకెళ్లాడు.

ఆగదిలో ఉన్న బల్బు కిరసనాయిల్ దీపం కంటే హీనంగా వెలుగుతోంది. గదిలో రెండు మూడు పాత కుర్చీలున్నాయి.

ఒక బల్ల కూడా ఉంది. బల్ల మీద వరహాలు కూర్చుని వుంది. వరహాలు కూడా ఒకప్పుడు మంచి పవరున్న కరెంటు దీపం లాగా వెలిగింది. ఇప్పుడా వెలుగు లేదు. త్వరలో ఆరిపోవడానికి సిద్ధంగా ఉన్న కిరసనాయిల్ దీపంలా ఉంది.

అద్దెకి తెచ్చి కట్టుకున్న చీరె కూడా మాసిపోయింది. పౌడర్ ఎంత మందంగా పులిమినా మొహాన మడుతలు దాగడం లేదు. కాటుక పూసిన కొద్దీ, కళ్లలో కాపురమున్న చీకటి పెరిగిందే గాని తరగలేదు. జడలో తురుముకున్న పువ్వులివాల్టివి కావు. వంటికి పూసుకున్న అత్తరు కుళ్లు కంపు కొడుతోందే కాని సువాసన వెయ్యడం లేదు.

రంగణ్ణి చూడగానే వరహాలుకి ప్రాణం లేచి వచ్చింది. ''ఏం తమ్ముడూ! బేరమేమైనా ఉందా?'' అనడిగింది ఆశగా, ఆత్రంగా.

రంగడు సమాధానం చెప్పలేదు. వాడు వరహాలు కోసం రాలేదు. ఇంకెవరైనా ఉన్నారేమో చూద్దామని వచ్చాడు. ఆ హోటల్లో వొళ్లమ్ముకునే వాళ్లంతా బేరం దొరికే వరకు ఆ గదిలో నిరీక్షిస్తూ ఉంటారు. ఇప్పుడు వరహాలు తప్ప మరెవరూ లేరక్కడ. వరహాలుకి బొత్తిగా ''డిమాండ్'' లేదు. ఆ సంగతి రంగడికి కూడా తెలుసు. వరహాలుని తీసుకెళ్తే దీన్నెందుకు తెచ్చావని చీవాట్లేస్తారు. తనకి ముట్టే డబ్బులు కూడా ముట్టవు. కష్టమర్లు కోరిన సరుకందజేస్తేనే తనకేమైనా ముడ్తుంది. అందుకే-''అబ్బే బేరం కాదు. ఏమీ లేదు. ఊరికే వచ్చాను'' అని సమాధానం చెప్పాడు వరహాలుకి.

వరహాలు కుంగిపోయింది. రంగడికేసి దీనంగా, దిగులుగా చూసింది. ''తమ్ముడూ! బేరం దొరికి ఇయ్యాల్టికి వారం రోజులైంది. షావుకారు అప్పులివ్వడం మానేశాడు. నిన్నటి నుంచి అన్నం కూడా లేదు. నాకు లేకపోయినా నేను చావను. కానీ ఇంట్లో నా బిడ్డలు......'' ఆపైన మాటలు పెగల్లేదు వరహాలుకి.

రంగడు మనిషి. రాయి కాదు. అందుకే వరహాలు స్థితి చూసి కరిగాడు. ''సరే చూస్తాను ఎవరైనా కావాలంటే చెప్తాను..'' అన్నాడు.

వరహాలు గుక్క తిప్పుకుని, ''బాబ్బాబు! ఇవ్వాళ ఏదో వొకరకంగా ఒక బేరం చూసి పెట్టావంటే, చచ్చి నీ కడుపున పుడతాను'' అంది.

అక్కణ్ణించి రంగడు మేడ మీదికొచ్చి, సరాసరి ఎనిమిదో నంబరు గదిలోకి వెళ్లాడు. అక్కడ పెద్ద యుద్ధం జరుగుతోంది. అవతారానికి, మణిక్యానికీ డబ్బు విషయంలో పేచీ వచ్చింది. అవతారం గదంతా దున్నేస్తూ, దాన్ని బూతులు తిడుతున్నాడు.

మాణిక్యం మంచం పట్టె మీద నిర్లక్ష్యంగా కూచుని మాటకి మాట సమాధానం చెప్తోంది. రంగడు రాగానే, బుడ్డి ఆలస్యంగా తెచ్చినందుకు వాణ్ని కూడా బూతులు తిట్టాడు అవతారం. రంగడు క్షమాపణ చెప్పుకొని, అక్కణ్ణించి వచ్చేశాడు. పన్నెండో నంబరు గదిలోకి వెళ్లాడు. అక్కడ జాయింట్ బిజినెస్ గాళ్లు ముగ్గురూ పేకాట మానేసి, తాగుతూ కూర్చున్నారు. రంగణ్ని చూడగానే, ''పిల్ల దొరికిందా?'' అని ఏక కంఠంతో అడిగారు.

''లేదు సార్. వరహాలొక్కతే ఉంది. ఇంకెవరూ లేరు'' అన్నాడు రంగడు.

''వరాలా....థూత్! అదెందుకు పనికొస్తందిరా ఎండునక్కలాగుంటది. మనిషంతా కలిపినా కిలో మాంసముండదు. అన్నీ ఎముకలే. అదెందుకురా'' అన్నాడొకడు.

''అది తప్ప ఇంకెవరూ దొరకరంటావా..'' అనడిగాడు రెండోవాడు.

''దొరకరు సార్'' అన్నాడు రంగడు.

''ఏదో ఒకతి. మాకిప్పుడు అర్జంటుగా పిల్ల కావాల! అదెట్టా వున్నా సరే. ఉండేదేదో దాన్నే పట్రా. ఈ బుడ్డి ఖాళీ అయ్యేసరికి అదే రంభలా గుంటది. దాన్నె పట్రా బేగెల్లు'' అన్నాడు మూడోవాడు.

మిగతావాళ్లిద్దరూ సరే కానిమ్మన్నారు.

''మేం ముగ్గురున్నాం. కావాలంటే రెండు రూపాయలెక్కువ తీసుకోమను. అంతే గానీ తరువాత పేచీ పెడ్తే కుదరదు ముందే జెప్తున్నాం.'' అని హెచ్చరించాడొకడు.

రంగడు మేడ దిగి మళ్లీ వరహాలున్న గదిలోకొచ్చాడు. ''ఏం తమ్ముడూ, బేరం దొరికిందా?'' అంటూ ఈ సారి మరింత ఆశగా, ఆత్రంగా అడిగింది వరహాలు.

''దొరికింది గానీ...'' అని నసిగాడు రంగడు.

''ఏంటి తమ్ముడూ చెప్పు. ఎంతిచ్చినా ఫరవాలేదు...ఎంతైనా సరే....''

''అది కాదు...డబ్బు బాగానే ఇస్తారు. ఆళ్లు ముగ్గురున్నారు. పైగా దున్నపోతుల్లాగున్నారు. నువ్వేమో ఇలాగున్నావు. అందుకని ఎనకాడతన్నాను...'' అన్నాడు రంగడు.

''ఫరవాలేదు తమ్ముడూ, ముగ్గురు గాదు-పదిమందైనా సరే...నేనుసచ్చినా పరవాలేదు. నా బిడ్డలు....పద తమ్ముడూ, పైకెల్దాం పద....'' అంది వరహాలు.

రంగడింకేమీ మాట్లాడలేకపోయాడు. వరహాలుని పైకి తీసుకెళ్లి పన్నెండో

నంబరు గదిలోకి పంపాడు గది తలుపు మూసుకొంది.

ఎనిమిదో నంబరు గది ముందుకొచ్చాడు. అవతారానికీ, మాణిక్యానికీ రాజీ కుదిరింది కాబోలు మళ్లీ తలుపు బిగించుకున్నారు.

గుమస్తా ఉద్యోగాలకి అభ్యర్థులని ఎన్నిక చేయడం కోసం పై ఊరి నుంచి వచ్చిన అధికారి ఏడో నెంబరు గదిలో దిగాడు. ఇవ్వాళ తొమ్మిది గంటలకి మాంచి-పడుచుదాన్ని-ఖరీదైన దాన్ని-నజరానాగా సమర్పించుకునంటా నన్న అభ్యర్థిగాడు పదైనా ఇంకా పత్తా లేడు. అంచేత ఆఫీసరు గారు ఆగ్ర హంతో ఉన్నారు.

కొత్తరకం అనుభవం కొనుక్కుందామని వచ్చిన కాలేజీ కుర్రాడు ఆరో నెంబరు గదిలో ఖంగారు పడుతున్నాడు.

అయిదో నెంబరు గదిలో-కంట్రాక్టరు, కంట్రాక్టు ఇప్పించే ఇంజనీరూ వాటాలు నిర్ణయించుకుంటున్నారు.

పదవ నెంబరు గదిలో పంచాయితీ స్థాయి నాయకులు నలుగురు అవతలి పార్టీ లీడర్ని అతిరహస్యంగా ఖూనీ చేయించడానికి పథకాలు పన్నుతున్నారు.

వీళ్లందరికీ ఇంకా మరికొందరికి కావలసినవన్నీ సమకూర్చి, రంగడు కిందకి వెళ్లేసరికి పదకొండు దాటింది. కౌంటరు దగ్గర ఎవరూ లేరు. డైనింగ్ హాల్ ఖాళీగా ఉంది. ఒక చోట ఇద్దరు సర్వర్లు బీడీలు తాగుతూ కూర్చొని బూతు కథలు చెప్పుకుంటున్నారు. రంగడు బేసిన్‌లో చేతులూ మొహమూ కడుక్కుని, కిచెన్‌లోకి వెళ్లి కూర్చున్నాడు. ఆకలి మండిపోతోంది. నౌకర్లు కూడా రంగడు తప్ప అంతా అప్పటికే తినేశారు. కునికిపాట్లు పడుతున్న ఒక సర్వరు గొణు క్కుంటూ-అడుగు బొడుగూ మిగిలినవన్నీ రంగడికి వడ్డించి, బయటకు పోయాడు.

తింటూండగా, రంగడికి వరహాలు గుర్తొచ్చింది. నిన్నటి నుంచీ అన్నం తిన లేదని చెప్పిన సంగతి గుర్తొచ్చింది. వరహాలు మీద విపరీతమైన జాలేసింది. ''ఆ తాగుబోతు ముండాకొడుకులు ఎప్పుడొదుల్తారో ఏమో పాపం! ఈ పూటైనా దానికి కూడుండదు'' అనుకున్నాడు. తను తినే దానిలోనే, కాస్త అన్నమూ, రెండు కూరలూ మిగిల్చాడు. తన భోజనం ముగించి, మిగిలినవి ఒక విస్తరిలో కట్టి, అంతకు ముందు వరహాలు కూర్చున్న గదిలోకి వెళ్లాడు. గదిలో ఎవరూ లేరు. అన్నపు పొట్లం బల్ల మీద పెట్టి బయటకొచ్చాడు.

హోటల్ ముందున్న కిళ్లీ కొట్టుదగ్గర-కానిస్టేబులొకడు కారా కిళ్లీ నములూ్తా, శృంగార కథల సచిత్ర మాస పత్రికొకటి తిరగేస్తున్నాడు. పత్రిక ఊరికే ఇవ్వాలి సొచ్చినందుకు కొట్టువాడు లోలోపల తిట్టుకుంటున్నాడు. రంగడక్కడికి వెళ్లి కిళ్లీ కట్టించుకున్నాడు. బీడీలు కొనుక్కుని ఒకటి వెలిగించాడు.

రోడ్డు మీద జనం పల్చబడిపోయారు. ఆకాశంలో చుక్కలు కిక్కిరిసి ఉన్నాయి. మునిసిపాలిటీ సైరన్ పన్నెండు కావడానికింకా అయిదు నిమిషా లుండనగానే కూసింది.

''అబ్బా అప్పుడే పన్నెండైందే'' అనుకుని రంగడు లోపలకి వచ్చేశాడు. వర హాలొచ్చిందేమో చూద్దామనుకొని ఆ గదిలోకి వెళ్లాడు. బల్ల మీద పెట్టిన అన్నపు పొట్లం అలాగే ఉంది. వరహాలొచ్చిన సూచనలేమీ లేవు. కాస్సేపలాగే కూర్చొని అక్కడే బల్ల మీద పడుకొన్నాడు.

తెల్ల వారింది. ''నవభారత్ విలాస్''లో రాత్రంతా పేరుకుపోయిన పాపాల చీకటిని, సూర్యుడు తన వెలుగు కిరణాల చీపుళ్లతో క్లీన్ చేస్తున్నాడు.

క్లీనర్ కుర్రాడొచ్చి లేపితే గానీ రంగడికి మెలకువ రాలేదు. లేచి, కళ్లు నులు ముకొని చుట్టూ చూశాడు. చీకటి కొట్టులాంటి ఆ గదిలోకి కూడా కాస్త వెలుగొ చ్చింది. వరహాలు కోసమని బల్ల మీద పెట్టిన అన్నపు పొట్లం-ఎలుకలు కాబోలు చించి చెల్లాచెదురు చేశాయి. చీమలు పుట్టలు పోశాయి.

వరహాలు రాలేదు.

''ఇంకెక్కడి వరాలు...'' అన్నాడు క్లీనర్ కుర్రాడు.

★

## మనమీదేనత్రోయ్...

సతసి..

